# పరిష్కారం!

★

రచన : గొల్లపూడి రమేష్



మూడు రోజుల్నుంచి ఒకటే ఆలోచిస్తున్నా! నాకేమీ పాలుపోవడంలేదు. ఇపుడేం చేయటం చెప్మా? పోనీ శ్రీమతిని సలహా అడుగుదామంటే నన్ను చీవాట్లెయ్యడం తప్ప వేరొకటుండదని నాకు తెలుసు. రచయితగా ఎన్నో కథలు వ్రాసి అనుభవం సంపాదించినా, ఈ సమస్యకు పరిష్కారం నాకే ఒక సమస్య అయి కూర్చుంది. అసలు జరిగిందేమిటంటే_

నేను ఇక్కడ కాలేజిలో లెక్చరర్‌ని. మా శ్రీమతి ఇదే ఊర్లో గరల్స్ స్కూల్‌లో టీచరు. ఓ రోజు కాలేజినుంచి రాగానే "ఏమండోయ్ రచయితగారు మీకో తమాషా చూపిస్తాగాని రండి" అంది.

నేను బాత్‌రూమ్‌నుంచి వచ్చేసరికల్లా వరండాలో కాఫీతో సిద్ధం అయివుంది. నా కసలే క్యూరియాసిటీ ఎక్కువ. ఏమిటని రెండుసార్లడిగినా · "మీరు కాఫీ త్రాగండి సార్" అంది.

తరువాత "మా స్కూల్లో ఆడపిల్లలకు వచ్చే ఉత్తరాలు మేము చూచి, ప్రేమలేఖలు కాకపోతే యిస్తుంటాము. ఈ ఉత్తరం ఎందుకో మీకు చూపించాలనిపించింది" అంటూ నా చేతికిచ్చింది ఓ ఉత్తరం. అదే ఇప్పుడు నాకు తలనొప్పిగా పరిణమించిన సమస్య. కవర్లోంచి బయటకుతీసి మడతలు విప్పాను.

డియర్ దేవీ!

మిమ్మల్ని కాకినాడలో మా స్నేహితుడి పెళ్ళిలో చూశాను. తొలి చూపులోనే మీరు నన్నాకర్షించారు. బహుశా నేను మీకు గుర్తు వుండివుంటాననుకుంటాను. ఆ రోజు రాత్రి ఫంక్షన్‌లో నేను కొన్ని కవితలు చదివాను. నేను మిమ్మల్ని గాఢంగా ప్రేమిస్తున్నాను. నా ప్రేమను ఈ ఉత్తరం ద్వారా తెలియజేయడం అసాధ్యమే అయినా నా 'హృదయ స్పందన' తెలియజేస్తున్నాను.

దేవీ సూర్యవర్ధనీ
మృదుమధుర భాషిణీ
అనంతనీల సుకేశినీ
అతిసుందర దరహాసిని.

మరుని చేతిశరమైన భామినీ
వసంతరాగ మాలపించు గాయనీ
నా బ్రతుకు తోడారి కామని
నీవుగాక వేరెవ్వరు వర్ధనీ.

అతి ప్రయత్నంమీద మీ అడ్రసు సంపాదించి ఈ లేఖ వ్రాస్తున్నాను. తిరస్కరించరన్న నమ్మకంతో; మీ జవాబుకై ఎదురుచూచే ప్రేమార్థి.

మీ కిరణ్.

కవర్ తిప్పి చూశాను అతని అడ్రలు రాసివుంది. కిరణ్‌ని మెచ్చుకోకుండా వుండలేకపోయాను. మా శ్రీమతి మాత్రం "ప్రేమా, పైత్యమా? వెధవ్వేషాలు కాకపోతే" అంది. ఉత్తరం యథాలాపంగా మడిచి జేబులో పెట్టుకున్నాను.

* * *

రచయితనుండే సహజ చాపల్యంవల్ల నాకో చిన్న చిలిపి కోరిక రేగింది. రెండవ రోజు లీజరులో కిరణ్‌కు వర్ధని వ్రాసినట్లుగా జవాబు వ్రాశాను. అడ్రసు మాత్రం నేను ప్రైవేట్లు చెప్పే రూమ్ అడ్రసు యిచ్చాను. ఈ విధంగా వర్ధని పాత్ర ధరించి, ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా మాంచి ఘాటైన ప్రేమలో పడ్డాం. కొంత కాలానికి ఆ కుర్రాడు రాసే ఉత్తరాలు చదువుతుంటే అయ్యో నిజం తెలిస్తే ఎంత బాధపడతాడో అనుకుని కూడా జవాబు రాయకుండా వుండలేకపోయేవాణ్ని.

ఇంతలో హఠాత్తుగా ఆటంబాంబులాంటి ఈ ఉత్తరం నా గుండెల్లో పేలింది.

మైడియర్ దేవీ!

ఇంతకాలం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రోజు ఇప్పుడు వచ్చింది. వచ్చేనెల నేను 'యానాం' వస్తున్నాను. మన పెళ్ళికి మా ఇంట్లో ఒప్పుకున్నట్లే. ఈ పదిహేను రోజులు పదిహేను క్షణాల్లా గడిచి పోవాలని కోరుకుంటున్నాను. అంటే రెండో ఆదివారం నేను ఫెర్రీలో నీ కోసం ఎదురుచూస్తాను.

ముద్దులతో

కిరణ్!

* * *

ఈ ఉత్తరం చూసిన దగ్గర్నుంచి నా మనసు మనసులో లేదు. కాలు చెయ్యి ఆడటంలేదు. అతనింతకాలం ఎవరితోనైతే ఊహాలోకాల్లో విహరిస్తున్నాడో ఆ వర్ధనికి కొలదికాలం క్రితమే పెళ్ళయిపోయిందన్న చేదు నిజాన్ని ఎలా చెప్పాలి? చెప్పినా భరించగలడా? అతణ్ణి కలుసుకుని అసలు విషయం చెప్తే బాధపడటం అటుంచి నన్ను అసహ్యించుకుంటాడేమో? ఏమీ తెలియ

ఆంధ్రప్రదేశంలో అన్ని షాపులలోను దొరుగుచున్నది
గోపాల్ పళ్ళపొడి



నట్లు వుండామంటే నా మనస్సాక్షి ఒప్పుకోవడంలేదు. ఇలా మథనపడి చివరికొక నిర్ణయానికొచ్చాను. అయినా ఆ ఆదివారం దగ్గరవుతుందంటే మనసులో కల్లోలం ఎక్కువవుతుంది.

*         *         *

ఆదివారం సాయంత్రం అయిదున్నర అయింది. నా ప్రియశిష్యుడు బాబుకు అంతా ముందే చెప్పివున్నా మరొకసారి వివరంగా బోధపర్చి ఫేర్రీకి వెళ్ళాము ఇద్దరం కలిసి కిరణ్ కోసం వెతకనారంభించాము. సమ్మర్ కావటంవల్ల నీరు చాలావరకు ఇంకిపోయి ఫేర్రీ చాలా విశాలంగా వుంది. ఒంటరిగా కూర్చున్న వాళ్ళు చాలామంది వున్నా వారిలో కిరణ్‌ను తేలికగానే గుర్తుపట్టగలిగాం. కుర్రాడు చాకులా వున్నాడు. బహుశా ప్రియురాల్ని కలుసుకోబోతున్నానన్న సంతోషంతో కాబోలు అతని ముఖం వెలిగిపోతోంది. నేను బాబు నుంచి విడిపోయి వారిమాటలు వినిపించేటంత దూరంలో కూర్చున్నాను.

బాబు దగ్గరగా వెళ్ళి "హల్లో కిరణ్ అంటే మీరే అనుకుంటాను" అన్నాడు.






చటుక్కున తలతిప్పి "అవును మీ కెలా తెలుసు" అన్నాడు.

"నేను మిమ్మల్ని కలుసుకోవాలని వచ్చాను."

"విచిత్రంగా వుందే నాకీ ఊర్లో స్నేహితులెవ్వరూ లేదే!" అన్నాడు కొంచెం తడబడుతూ.

బాబు కొంచెం రుద్ధస్వరంతో "చాలా బాధకరమైన వార్త చెప్పవలసివస్తున్నందుకు విచారిస్తున్నాను" అన్నాడు.

పరవాలేదు. చెప్పిన దానికంటే ఎక్కువే నటిస్తున్నాడు అనుకున్నాను.


## ప్రఖ్యాత అల్లోపతి మెడికల్ గైడ్స్

***

| | రు. పై. |
|---|---|
| రోగ నిర్ణయము ... | 4-50 |
| అల్లోపతి స్కిన్ అండ్ ఎనిమిక్ డిసీజస్ రెఫరెన్స్ గైడ్ (నూతన కూర్పు) ... | 15-00 |
| అల్లోపతి వెనీరియల్ అండ్ సెక్స్ (నూ. కూ.) | 15-00 |
| అల్లోపతి ఇ ఎన్.టి. హార్ట్ అండ్ లాఫ్స్ ,, | 15-00 |
| అల్లోపతి టాబెలెట్స్, కేప్సుల్స్, టానిక్స్ అండ్ అయింట్‌మెంట్ రెఫరెన్స్ గైడ్ | 18-00 |
| అల్లోపతి ఇంజక్షన్ రెఫెరెన్స్ గైడ్ ... | 18-00 |
| అల్లోపతి మెడికల్ మిర్రర్ (నూతన కూర్పు) | 15-00 |
| అల్లోపతి మిక్చర్ గైడ్ ... | 15-00 |
| అల్లోపతి వైద్య చింతామణి (నూతన కూర్పు) | 15-00 |
| బిడ్డల సంరక్షణ వ్యాధులు-చికిత్సలు ... | 15-00 |
| అల్లోపతి మెటీరియా మెడికా-జి. వి. రావు ... | 15-00 |

Contact for futher details :-

**Dr. A. E. SHANMUGAM,**

76, N. V. Street, MADRAS-600 021.


## చిత్రం పేరుమార్పు

14-10-79 వ తేదిన ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స అధినేత శ్రీ అనుమోలు సుబ్బారావుగారు పత్రికల వారితో ఇష్టాగోష్టి జరిపారు. అందులో వారు తీస్తున్న నరుడా ఏమినీ కోరిక చిత్రానికి "నాయకుడే వినాయకుడు" అనేపేరును స్థిరపరచానని తెలిపారు. పేరుమార్చటానికి గల కారణాన్ని శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, నిర్మాత : సుబ్బారావు, దర్శకుడు : సత్యగాత్మ వివరించారు.

వివరములు వచ్చే నెల సంచికలో ప్రచురిస్తాము.

—ఎ. ఆర్. రామప్రసాద్.

"వర్ధని పెండ్లి నాల్రోజుల క్రిందటే జరిగిపోయింది" అన్నాడు బాబు విషాదం పలికిస్తూ.

ఆ కుర్రాడినుంచి ఎటువంటి ఫీలింగ్ వస్తుందో అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను. నమ్మలేనట్లు ముఖం పెట్టినా, షాక్ తిన్నట్లు అయిపోయాడు.

మళ్ళీ బాబు అన్నాడు. "చిన్నప్పట్నుంచీ వాళ్ళ బావకిచ్చి పెళ్ళి చేయాలనుకున్నారు. కానీ వర్ధనికే మాత్రం ఇష్టంలేదు. వాళ్ళ బావకు 'గల్ఫ్ కంట్రీస్'లో జాబ్ కి పాస్‌పోర్టు రావటంతో అర్జంటుగా పెళ్ళిచేసేశారు. మీకు ఉత్తరం రాసే వ్యవధికూడా లేదు. కానీ వెళ్ళిపోయేటప్పుడు వర్ధని ఏడుస్తూ రహస్యంగా నాకు మీ సంగతి చెప్పి మీ క్షమాపణ కోరమంది."

కిరణ్ నిశ్చలంగా శూన్యంలోకి చూస్తూ వుండిపోయాడు. ఆ చూపును నేను వర్ణించలేను. బహుశా కొద్దిసేపట్లో ఉరితీయబోయే ఖైదీ ఇలాగే పాలిపోతాడేమో అనిపించింది.

బాబుని ఇంక వెళ్ళమని సైగచేశాను వెళ్ళిపోయాడు. టైమ్ గడిచిపోయింది. సూర్యుడు నా మీది కోపంతో ఎర్రబడి, నాపైన అసహ్యంతో నా ముఖం చూడలేక పశ్చిమాద్రి వెనక్కి వెళ్ళిపోయాడు. దాదాపు రెండు గంటల కాలం గడిచి వుంటుంది. ఆ కుర్రాడు కదల్లేదు. అలాగే మోకాళ్ళపై తలవాల్చి కూర్చుండిపోయాడు. ఫెర్రీ అంతా దాదాపు ఖాళీ అయిపోయింది. నాకు మనసులో భయం పీకుతుంది, ఈ కుర్రాడు ఆత్మహత్యా ప్రయత్నం చేస్తాడేమోనని. నేనే వెళ్ళి పలుకరించాను.

"చూడు బాబూ, నేను అంతా విన్నాను. మన చేతుల్లో ఏమీ లేదు. అంతా దైవనిర్ణయం" అన్నాను.

మెల్లిగా తలెత్తి వెర్రిచూపు చూశాడు. మీకేం తెలుసు ప్రేమంటే? అన్న అర్థం దాగివుందా చూపులో.

"నీవెలాంటి అఘాయిత్యం తలపెట్టనని మాట ఇవ్వు బాబూ! నీవు నా కొడుకులాంటి వాడవు" అన్నాను.

గట్టిగా నిట్టూర్చి "అంత పిరికివాడిని కానులేసార్!" అంటూ లేచాడు.

ఇద్దరం కలిసి ఊర్లోకి దారిపట్టాము. దూరంగా చర్చిలో గడియారం 8 గంటలు కొట్టింది. అడ్మినిస్ట్రేటర్ బిల్డింగ్ వెలిగిపోతూ వుంది. మౌనంగా అతనివెంట బస్టాప్ వెళ్ళి, బస్సు ఎక్కించి, కదిలేవరకూ వున్నాను.

మళ్ళీ జన్మలో ఇలాంటి వెధవపని చేయకూడదని లెంపలు వేసుకొని బుద్ధిగా ఇంటిదారి పట్టాను. చందమామ కొంటెగా నవ్వుతూ నావైపు చూస్తున్నాడు.

## "ధనలక్ష్మి పిలిచింది" వర్ణచిత్రం



ఉమాకాంత్ ఆర్ట్ పిక్చర్స్ "ధనలక్ష్మి పిలిచింది" వర్ణచిత్రం యువదర్శకుడు రాజవర్ధన్ దర్శకత్వంలో నవంబరు నెలలో జరుగు ఆఖరి షెడ్యూలుతో చిత్ర నిర్మాణం పూర్తవుతుంది. ఈ వర్ణచిత్రం డిశంబరు నెలాఖరుకు విడుదలవుతుంది.

ఈ వర్ణచిత్రంలో నూతన్ ప్రసాద్, సత్యేంద్రకుమార్, నవకాంత్, ప్రసాద్ బాబు, ప్రభాకరరెడ్డి, త్యాగరాజు, రావికొండలరావు, నూతన నటుడు రజనీకాంత్ రెడ్డి, చిట్టిబాబు, కాంచన, గీత, విజయలక్ష్మి, జయమాల, జయరేఖ, జయమాలిని మొదలగువారు నటిస్తున్నారు. శ్రీ కొప్పిసెట్టి కథను సమకూర్చిన యీ వర్ణచిత్రానికి మాటలు: అప్పలాచార్య, పాటలు: ఆరుద్ర, వీటూరి, వేటూరి, సంగీతం: శివారెడ్డి, కెమెరా: కె.ఎస్. రావు, ఆర్ట్: అనంతరావు, ఎడిటింగ్: గౌతమ్‌రాజు.

ఈ చిత్రానికి ప్రప్రథమంగా దర్శకుడుగా పరిచయమవుతున్న శ్రీ రాజవర్ధన్ లోగడ ప్రసిద్ధ దర్శకులు శ్రీ లక్ష్మీదీపక్, సి. యస్. రావులవద్ద పనిచేశారు.

నిర్మాత: యం. శంకరరెడ్డి, స్క్రీన్ ప్లే, దర్శకత్వం యం. రాజవర్ధన్.